**ఈ కథ పిల్లలకి ప్రత్యేకం**

# పశుపతి మాన్యం

**-డా. దొన్నలగడ్డ మార్కండేయులు**

వాడపల్లి అనే గ్రామంలో ఉన్న వేద పాఠశాలలో పదేళ్ల వయసున్నప్పుడు పశుపతి అనేవాడు వేదాన్ని నేర్చుకున్నాడు. పశుపతికి ఇరవై సంవత్సరాలు వచ్చాయి.

అతడు ఇక బ్రహ్మచర్యం విడిచిపెట్టి నేర్చుకున్న విద్యతో ఏదో గ్రామంలో పురోహితుడిగా స్థిరపడి సంసారి కావాలని గురువుల అనుమతి పొంది దేశం మీదకు బయలుదేరాడు. అతడికి నా అనేవాళ్ళు ఎవ్వరూ లేరు. అతడలా ప్రయాణం చేస్తూ రాజవరము అనే గ్రామం చేరుకున్నాడు.

ఊరి పొలిమేరలో ఏటి గట్టు మీద నడుస్తుండగా గట్టుమీద ఒక వ్యక్తి చేతిలో శివలింగంతో ఏటి నీటిలోకి దిగడానికి వెడుతున్నాడు. పశుపతి అతన్ని ఆపి "ఏం చేయబోతున్నావు?" అని అడిగాడు.

చేతిలో శివలింగం వున్న వ్యక్తి విచారంగా ముఖం పెట్టి "నా పేరు పట్టెయ్య. మా గ్రామ శివాలయం శిథిలమైపోయింది. కొత్తది నిర్మించాము. పాత శివలింగం స్థానంలో కొత్తది ప్రతిష్ఠించాలనే ఆశతో కాశీ నుంచి ఈ శివలింగాన్ని తేవడానికి వెళ్లాను. కానీ ప్రతిష్ఠ సంకల్ప సమయానికి నేను చేరుకోలేకపోయాను. అందుచేత పాత శివలింగాన్నే ప్రతిష్ఠించడానికి నిర్ణయమైపోయింది. చేసేదిలేక ఈ శివలింగాన్ని నదిలో నిమజ్జనం చేస్తున్నాను" అన్నాడు.

"అయ్యా! మీరు చేస్తున్న పని అర్థంలేనిది. కోటివరకు శివలింగాలు ప్రతిష్ఠించ వచ్చునడానికి కోటిలింగాల క్షేత్రమే రుజువుగా గోదావరి తీరాన వుంది. నేను వేదం చదువుకున్నాను. ప్రమాణంగా చెబుతున్నాను. తెచ్చిన శివలింగం కాశీ నుంచి. తప్పక పూజార్హమవ్వాలి. నీటిపాలు చేయవద్దు. పాతదానితోపాటు ఈ శివలింగాన్ని తప్పక ప్రతిష్ఠించాలి. రెండు శివలింగాల గుడిగా మీ గ్రామం పేరు పొందాలని దైవ సంకల్పమై వుంటుంది. మీ గ్రామస్థులకు నేను నచ్చచెబుతాను. పదండి ఊళ్లోకి వెళదాము" అన్నాడు పశుపతి.

ఇద్దరూ కలసి ఊళ్లోకి వచ్చారు.

పశుపతి సప్రమాణంగా చెప్పిన మాటలు అందరికీ నచ్చాయి. రెండు శివలింగాల ప్రతిష్ఠ జరిగి నూతన దేవాలయం అందర్నీ ఆకర్షించసాగింది.

రెండవ శివలింగం పట్టేశ్వరస్వామిగా పేరుకెక్కసాగింది.

ప్రతిష్ఠ సమయంలో పశుపతి వేదం చదివిన తీరు అందరినీ ఆకట్టుకుంది.

అందరూ అతడిని తమ గ్రామంలోనే ఉండిపొమ్మని కోరసాగారు.

పెద్ద భూస్వామి అవడంచేత తన శివలింగానికి గుర్తింపు తెచ్చిన పశుపతి తన గ్రామంలోనే ఉండితీరాలని కోరి ప్రతిష్ఠ సమయంలో ఒక ఎకరం పొలాన్ని ధారపోసాడు.

పశుపతికి చాలా సంతోషం కలిగింది. రాజవరం గ్రామంలోనే ఉండిపోవడానికి నిశ్చయించుకున్నాడు.

ప్రతిష్ఠ కార్యక్రమాలు నాలుగైదు రోజులు సాగాయి.

ఆ సమయంలో రాజవరం గ్రామ శివాలయ పూజారి కుమార్తె దుర్గ చక్కని హరి కథలు చెప్పి జనాన్ని ఆకట్టుకుంది.

ఆఖరిరోజున ఆమె నందీశ్వరుడి గురించినకథ చెప్పింది.

ఆ కథ విని "కథ విన్నవారికి పాడి ఆవు, చెప్పినవారికి చూడి ఆవు ఇవ్వాలని అంటారు. చక్కని కథలు చెప్పిన పూజారిగారమ్మాయికి నేను చూడి ఆవును బహూకరిస్తాను" అని పట్టెయ్య అప్పటికప్పుడు తన పశువుల కొట్టం నుండి ఈనడానికి సిద్ధంగా ఉన్న ఆవును తెప్పించి అందరి సమక్షంలో ఆమెకు సొంతం చేసాడు. పూజారి అమితానందం పొందాడు.

అయితే దేవుడి మహిమో లేక సమయం వచ్చిందో చెప్పలేము కానీ బహుమతిగా ఇచ్చిన ఆవుమరికొద్దిసేపట్లోనే గుడిలోనే ఈని కవల కోడె దూడలను పెట్టింది.

ఆ రెండు కోడెదూడలు చూడముచ్చటగా ఉన్నాయి.

నందీశ్వరుడే కోడె దూడల రూపంలో అవతరించి రెండు శివలింగాలకు నమస్కరించదలచాడని జనం భక్తితో పరవశించిపోయారు.

"నందీశ్వర ప్రతిరూపాలైన ఈ కోడెదూడలను శివార్పితంగా అచ్చోసి ఆబోతులుగా పెద్దయ్యాక వదిలేయాలి" అని ఎక్కువమంది అభిప్రాయపడసాగారు.

శివాలయ ప్రతిష్ఠ కార్యక్రమంలో భాగంగా పాల్గొన్న గంగిరెడ్డులను ఆడించువాడు ముందుకు వచ్చి జనంతో "అయ్యా! శివుడు నాట్యప్రియుడు. మా గంగిరెడ్డుల ఆటకు ప్రసన్నుడైనాడేమో! ఒక కోడెదూడను అచ్చోసి వదిలేసినా రెండో దూడను మాకిప్పించి దయ చూపండి. దానికి ఆట పాట నేర్పి ప్రతి ఏటా శివ కళ్యాణానికి తీసుకువస్తాము" అన్నాడు.

పశుపతి వారించి "ఇది నాలుగేళ్ల తరువాతి నాటి మాట. కోడెదూడలు అప్పటికిగాని పెద్దవి కావు. అప్పుడు పెద్దలు ఎలా నిర్ణయిస్తే అలా చేయడం న్యాయం. పైగా అవి పూజారిగారివి కాబట్టి ఆయన అభిప్రాయాన్ని కూడా మన్నించాల్సి వస్తుంది" అన్నాడు.

అప్పటికి అందరూ ఊరుకున్నారు.

***

ఆ మర్నాడు ప్రస్తుతానికి పట్టెయ్య భూస్వామి ఇంట్లోనే వున్న పశుపతిని గుడి పూజారి కలిసాడు. పురోహితుడిగా గ్రామంలోనే ఉండిపోదలచిన పశుపతిని తన కూతురు దుర్గను పెళ్లి చేసుకొమ్మని అడిగాడు.

తనను ఆలోచించుకోమని పశుపతి పూజారిని పంపేసి ఏటి గట్టుకేసి బయలుదేరాడు. దారిలో అతనికి తిరిగి వెళ్లిపోతున్న గంగిరెడ్డులవాళ్ళు కనిపించారు.

వాళ్ల వెంట నాలుగైదు గంగిరెద్దులున్నాయి. అందులో ఒక ఎద్దు కుంటుతోంది. పైగా నీరసంగా ఉంది.

ఆ గంగిరెద్దు కొత్త గిత్త. దానికి ఆట నేర్పే భాగంలో దారికి తీసుకురావడానికి దాన్ని తిండికి

మాడ్చారు.

అందుచేత నీరసంగా ఉంది. కొట్టినప్పుడు కాలికి గాయం అయింది. ఇంకా కొంచెం పొగరు ఉన్నా ఇలాగే అణచి దారిలోకి తెస్తామని వాళ్ళు గొప్పగా చెప్పి తమకు శివాలయంలో పుట్టిన కోడె దూడలలో ఒకదానిని భవిష్యత్తులో తమకు ఇప్పించే ప్రయత్నం చేయమని అడిగారు. పశుపతికి గంగిరెద్దును చూస్తే జాలేసింది. గుడిలో పుట్టిన దూడకు ఈ దుస్థితి రానివ్వద్దని అది వేడుకుందా అన్నట్లు అది ముందుకు సాగిపోయింది. అందుచేత వాళ్లకు ఏమీ చెప్పకుండానే ముందుకు సాగిపోయాడు.

ఏటిగట్టుకు కొంచెం దూరంలో పశుపతికి ఓ ఆబోతు కనిపించింది.

పశుపతి దానికి దగ్గరగా వెళ్లాడు. అచ్చోసి వది



లేసిన కోడెదూడది.

దాన్నందరూ నందీశ్వరుడిగా భావించి ఇంటి ముందుకు వస్తే చేటలో బియ్యం పోసి పూజిస్తారు.

పంట చేలో పడి మేసినా నమస్కరించి బయటకు రమ్మని ప్రార్థించాలి గానీ కొట్టకూడదు.

కానీ ఈ ఆబోతును ఎవరో బాగా కొట్టారు. బహుశా అది ఏ పేదవాడి చేలోనో, నాస్తికుడి చేలోనో మేసి వుంటుంది. పశుపతి దాన్ని ప్రేమగా నిమిరాడు. అది లేచి అతని వెనకే రాసాగింది.

పశుపతి అతని వెనుకే ఆబోతు ఇద్దరూ కలసి ఏటిగట్టుమీదకు వచ్చారు. అక్కడొక రావి చెట్టు ఉంది.

ఆ రోజు శనివారం. అందుచేత ఆ రోజున రావిచెట్టును పూజిస్తే మంచిదని దుర్గ అక్కడకు వచ్చింది.

దుర్గ ముందు పశుపతిని చూసి సిగ్గుపడింది. కానీ అతని కూడా ఉన్న ఆబోతును చూసిన తరువాత దాని ఒంటిమీద దెబ్బలు గమనించి ఏమిటని అడిగింది.

పశుపతి ఊహించిన కారణాలు విని చలించిపోయింది. పశుపతి తాను చూసిన గంగిరెద్దు నీరస స్థితిని కూడా చెప్పాడు.

దుర్గ బాధగా "గంగిరెద్దువాళ్ళు తమ జీవితాలు పోషించుకోవడానికి గిత్తలను బాధిస్తున్నారు. మతం పేరుతో అచ్చోసి గిత్తలను ఆబోతుల్ని చేసి మనం వదులుతున్నాం. భక్తితో మేత దొరికితే సరేసరి ఫర్వాలేదు. కానీ ఆ తరువాత ఆబోతులు విచ్చలవిడిగా తిరిగి మేత దొరకని సమయంలో ఏ పేదవాళ్ల చేను మేసినప్పుడో, కోపిష్టి వాళ్ల చేతిలోనో తన్నులు తింటున్నాయి. ముసలితనంలో పని చేయలేని వాటిని నిర్దాక్షిణ్యంగా కబేళాలకు తోలి మాంసం కోసం చిత్రవధ చేసి చంపేస్తున్నారు. వ్యవసాయపు పనులన్నిటికీ కోడెదూడలు కావాలి. ఈ కోడెదూడలు కేవలం వ్యవసాయానికి మాత్రమే ఉపయోగపడేలా చేసి మేలుజాతి పశుసంపద వృద్ధి చేయగలిగే ఏర్పాటుంటే ఎంత బాగుండునో కదా. ఈనాముగా వచ్చిన ఆవుకు పుట్టిన కోడెదూడల భవిష్యత్తు తలచుకుంటే భయంగా ఉంది'' అంది.

ఆ తరువాత ఎవరి ఇళ్లకు వాళ్ళు వెళ్లిపోయారు. కానీ ఆబోతు మాత్రం పశుపతి వెనకాలే అతని ఇంటికి వచ్చింది. అంతేకాదు ఆ రోజునుంచి అది ఎక్కడికీ వెళ్లేదికాదు.

పశుపతి పెడితే తినేది. అతడెక్కడకు వెళ్లితే అక్కడకు వచ్చేది. అది చూసి జనం వింత పడేవారు.

ఒకరోజు పశుపతి తనకు పట్టెయ్య దానంగా ఇచ్చిన పొలం దగ్గరకు వెళితే అది కూడా వచ్చి నాగలి చుట్టూ తిరగసాగింది. దానికి పొలం దున్నాలని ఉందేమోనని దాన్ని నాగలికి కడితే అది ఉత్సాహంగా పొలం దున్నింది. పశుపతి ఆ దృశ్యాన్ని చూసి ఇలా చెప్పాడు.

"మనలాగే పశువులకు నోరు లేకపోవచ్చుగానీ మనసుంటుంది. గంగిరెద్దు బ్రతుకుగానీ, పూజలందుకునే పనిలేని బ్రతుకుగానీ కోడెదూడలు కోరుకోవడంలేదు. మనతోపాటే పొలంలో కష్టపడి గింజలు మనకందించి గింజలతో బాటు మిగిలిన గడ్డిని తినాలని అవి కోరుకుంటున్నాయని ఈ ఆబోతు చెబుతోందని నాకనిపిస్తోంది. దీని పోషణభారం నేను స్వీకరిస్తున్నాను. అంతేకాదు పట్టెయ్యగారిచ్చిన ఈ పొలాన్ని నేను స్వయంగా దున్నలేను కాబట్టి కౌలుకిస్తాను. అయితే పశు ప్రదర్శన ఏర్పాటుచేసి మేలుజాతి కోడె పశువులు కలిగి ఉన్న ఆసామీని పట్టెయ్యగారిచేత ఎంపిక చేయిస్తాను. ఈ పొలం సంవత్సరానికి రెండు పంటలు పండుతుంది అని మీకందరికీ తెలుసు. ఎంపిక కాబడినవారికి నా పొలాన్ని కౌలుకిస్తాను. అంతేకాదు రెండవ పంట మీద వచ్చే ఆదాయంలో నాకు వాటా అవసరంలేదు. ఒక పంట ఆదాయం నాకిస్తే చాలు. మేలుజాతి కోడెదూడలు అభివృద్ధి చెందాలన్నదే నా ఆశయం'' అన్నాడు.

పశుపతి ఆశయం ఫలించింది.


పొలం కౌలుకు లభించడమే కాకుండా ఒక పంట ఆదాయం లభించే పొలం వస్తుండడంతో పశు ప్రదర్శనలో పేరు తెచ్చుకోవాలని, కౌలు పొలం సంపాదించాలనే పోటీ పెరిగి రైతులు పశు పోషణపై శ్రద్ధ వహించి రాజవరం పశువులకు దేశంలో మంచి పేరు తెచ్చారు.

***

పశుపతి, దుర్గను పెళ్లి చేసుకుని ఆమె రెండు కోడెదూడలను వ్యవసాయానికి పనికివచ్చేలా చేసి లాభపడ్డాడు.

పశుపతి పొలానికి 'పశుపతి మాన్యం' అని పేరు వచ్చి ఇతర గ్రామాల వారు కూడా పశు ప్రదర్శనలో కౌలుదారులు కావాలని, పశుపతి మాన్యం సంపాదించాలని ఉవ్విళ్లూరేవారు.

★



## సాయం

తమ సంపాదనలో కొంతైనా సమాజానికి ఉపయోగపడితే ఎవరికైనా అంతకన్నా కావాల్సింది ఏముంటుంది చెప్పండి? ఇప్పుడు యువనటుడు తరుణ్ కూడా అలాగే ఆలోచిస్తున్నాడు. చిన్నతనంనుంచే హృద్రోగాలతో బాధపడుతూ సాయం కోసం ఎదురుచూస్తున్న చిన్నారుల కోసం లిటిల్ హార్ట్స్ ఫౌండేషన్ తనవంతు సాయం చేస్తోంది. ఈ ఫౌండేషన్‌కి తనవంతు సాయంగా పుట్టినరోజు సందర్భంగా తరుణ్ లక్షరూపాయల్ని విరాళంగా ప్రకటించి తన ఉదారతని చాటుకున్నాడు. ఇలాంటి సాయం ఇంకా ఎవరైనా చేస్తే బాగుండును కదా!

